క్లుప్తంగా

గీతా కాలనీలో ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు అందించిన నాయకులు

ఏలూరు రూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా బీకేఎంయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చాటపర్రు గీతాకాలనీలో సంప్రదాయ ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం కృష్ణచైతన్యలు మాట్లాడుతూ పండుగ ముసుగులో కొందరు వ్యక్తులు నిర్వహించే పేకాట, కోడి పందేల వల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. జూదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాట్టీల పెంటయ్య, ముత్త నాగరాజు, చిన్ని శ్రీనివాసరావు, పి.సూర్యరావు, దాసు గణపతి, పి.నాగశ్రీను, పి.లక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష సాయం



బీవీఎస్ రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

లింగపాలెం : మండలంలోని యడవల్లి గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్‌రెడ్డి) రూ.లక్ష సాయం అందించారు. బుధవారం యడవల్లి కనక దుర్గమ్మ ఆలయంలో బీవీఎస్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పూల మాలలతో సన్మానించారు.

పశుపోషణ ప్రతి ఒక్కరి బాధ్యత

గణపవరం: సంప్రదాయాలకు పెద్దపీట వేసే సంక్రాంతి పర్వదినంలో ప్రతి ఒక్కరూ పశు పోషణకు కంకణ బద్ధులుకావాలని పలువురు అన్నారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా గణపవరం టీటీడీ కల్యాణ మండపంలోని రామాలయం వద్ద గోపూజ నిర్వహించారు. పశువులను అలంకరించారు. గోపూజ చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత హేండ్ లూమ్స్ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు మాట్లాడుతూ తెలుగు లోగిళ్లో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పశుపషణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. కనుమ అంటేనే పశువుల పండుగని, పశువులను ప్రత్యేకంగా అలంకరించడం, గోపూజలు చేయడం సంప్రదాయంగా వస్తోందని దీనిని కొనసాగించడం మన బాధ్యతని అన్నారు.

పండుగ వేళ.. వలంటీర్ల వెత

- సేవలకు దూరం.. బతుకు భారం
- అందని గౌరవ వేతనాలు
- రూ.10 వేల వేతన హామీ గాలికి
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



వార్డు సచివాలయం

ఏలూరు నగర పాలక సంస్థలో వలంటీర్లు	
మొత్తం డివిజన్లు	50
సచివాలయాలు	79
వలంటీర్లు	1,434
మొత్తం ఇళ్లు	88,366
రేషన్ కార్డులు	66,075

ఏలూరు (టూటౌన్): తెలుగు ప్రజలకు అత్యంత ప్రధాన పండుగ సంక్రాంతి. అటువంటి పండుగ రోజుల్లో వలంటీర్ల కుటుంబాల్లో నిరాశ, నిస్పృహలు అలముకున్నాయి. గత ఎనిమిది నెలలుగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వలంటీర్లను పక్కన పెట్టేసింది. వారికి ఇవ్వాల్సిన కనీస గౌరవ వేతనాలను నిలిపి వేసింది. దీంతో ఉద్యోగం ఉన్నదీ లేనిదీ తేలియక, నెలకు ఇచ్చే కనీస వేతనం రూ.5 వేలు సైతం అందక వలంటీర్లు కొట్టుమిట్టాడుతున్నారు. ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 88,366 ఇళ్లున్నాయి. రేషన్ కార్డులు 66,075, క్లస్టర్‌లు 1,484, డివిజన్లు 50 ఉన్నాయి. మొత్తం 79 వార్డు సచివాలయాలు ఉండగా, వీటి పరిధిలో 1,434 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా గౌరవ వేతనాన్ని ప్రభుత్వం చెల్లించకపోవడంతో వలంటీర్లు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

సీఎం సారూ.. హామీ మరిచారా?

తమ ప్రభుత్వం అధికారంలోకొస్తే వలంటీర్ల వేతనం రూ.10 వేలకు పెంచుతామంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. దీనిపై ఇంతవరకు ఆయన ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇచ్చిన హామీని గాల్లోనే కలిపేశారంటూ విమర్శలు వస్తున్నాయి. వేతనం పెంపుదల మాట అలా ఉంచితే కనీసం గతంలో ఇచ్చే రూ.5 వేలు కూడా ఇవ్వకపోవడంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు.

సేవలకు దూరం

గతంలో వలంటీర్లు తమకు కేటాయించిన 50 గృహాలకు సంబంధించి అన్ని పనులు దగ్గరుండి చక్కబెట్టేవారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఇచ్చే పింఛన్లను తమ పరిధిలోని ప్రజలకు క్రమం తప్పకుండా అందేలా చర్యలు తీసుకునేవారు. వైఎస్సార్ సీపీ హయాంలో నియమించిడం వల్లే వలంటీర్లను సేవలకు దూరం పెడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేతన బకాయిలు చెల్లించాలి



గ్రామ, వార్డు వలంటీర్లకు తక్షణం వేతన బకాయిలు చెల్లించాలి. గత ఎనిమిది నెలలుగా వలంటీర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల పట్ల సానుకూలంగా స్పందించాలి. వేతనాలు తక్షణం విడుదల చేయాలి. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ల వేతనాలు నెలకు రూ.10 వేలకు పెంచాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు జిల్లా

వేతనాలు ఇవ్వడం లేదు



నగరపాలక సంస్థలో పని చేస్తున్న వార్డు వలంటీర్లకు గత ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. కనీసం విధుల్లోకి తీసుకోకుండా మమ్మల్ని గాల్లో పెట్టారు. కనీసం గతంలో ఇచ్చిన రూ.5 వేలు గౌరవ వేతనం అయినా చెల్లిస్తే మా కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది. రాజకీయాల ముసుగులో మమ్మల్ని పక్కన బెట్టడం ఎంత వరకు సమంజసం.

– బి.పృథ్వీరాజు, వలంటీర్, లంకపేట, 59 సచివాలయం, ఏలూరు

సేవలకు దూరంగాను ఉంచుతున్నారు

తాము ప్రతి నెలా ఐదో తేదీ వరకు ఇచ్చే పింఛన్లను తమ పరిధిలోని లబ్ధిదారులకు క్రమం తప్పకుండా అందేలా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందేలా చూసేవారం. ఇప్పుడు తమను విధులకు దూరం పెట్టడం బాధాకరం. మాకు గౌరవ వేతనం కూడా ఇవ్వడంలేదు. అందరూ సంక్రాంతిని ఉత్సాహంగా జరుపుకుంటుంటే.. మేము మాత్రం ఆవేదనతో గడపాల్సి వచ్చింది.

– ఎస్‌కే బాషా, వలంటీర్, ఫిలాస్ పేట, 56వ సచివాలయం, ఏలూరు

70 శాతం మహిళా వలంటీర్లే



ఏలూరు కార్పొరేషన్‌లో పని చేసే వార్డు వలంటీర్లలో 70 శాతం వరకు మహిళలమే ఉన్నాం. రూ.5 వేల గౌరవ వేతనం మా కుటుంబాలకు వేడి నీళ్లకు చల్లని నీరులా అక్కరకు వచ్చేది. గత 8 నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో మా కుటుంబాలు బతికేందుకు నానా అవస్థలు పడుతున్నాయి. ప్రభుత్వం తమను విధుల్లోకి తీసుకోవాలి. బకాయి వేతనాలు చెల్లించాలి.

– పి.మమత, వలంటీర్, వెంకటాపురం, 6వ సచివాలయం, ఏలూరు

విద్య, ఐక్యతతోనే అభివృద్ధి

దెందులూరు: విద్యతోనే అభివృద్ధి, ఐక్యత అవగాహన కలుగుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ డాక్టర్ పీ. రవీంద్రబాబు అన్నారు. కొవ్వలి కమ్యూనిటీ హాలులో అంబేడ్కర్ పై శరణం గచ్ఛామి నాటకాన్ని హైదరాబాద్ అభ్యుదయ అకాడమి సభ్యులు ప్రదర్శించారు. పాత్రధారులను ఎమ్మెల్సీ రవీంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులంతా ఐక్యంగా ఉంటూ ప్రతి ఒక్కరూ విద్య అభ్యసించాలన్నారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలు ఫలితమే నేడు దేశంలో పేద, బడుగు, బలహీన, గిరిజన, దళిత, మైనార్టీ వర్గాల హక్కుల పరిరక్షణ అభివృద్ధి భద్రత భవిష్యత్ లభించిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మేధా సంపత్తి దూరదృష్టి భారతీయులందరికీ ముఖ్యంగా దళిత గిరిజన మైనార్టీ పేద, బడుగు, బలహీన వర్గాలకు వరమన్నారు. ఏం చేసినా ఆయన రుణాన్ని తీర్చుకోలేమన్నారు. వేదికపై దెందులూరు మండలం వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, జాన్‌ఎఫ్రాయిమ్ రాజు, కే.వెంకటేశ్వరరావు, కాటి అర్జున్, గొట్టికల నాగభూషణం ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు కొవ్వలి దళిత పెద్దలు, గ్రామస్తులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వామివార్ల ఊరేగింపు

భీమడోలు: మంగళ, బుధవారాల్లో వేంకటేశ్వర స్వామి, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయం, వేంకటేశ్వర స్వామి వార్ల ఉభయ దేవేరుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. సుందరంగా ముస్తాబైన వాహనంపై మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. స్వామి వార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. గుండుగొలనులో వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

పిల్లలకు ధర్మాన్ని బోధించండి



విఘ్నేశ్వర స్వామికి పూజ చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేటి తరం పిల్లలకు ధరాన్ని బోధించాలని అవధూత దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ సూచించారు. స్థానిక దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో ద్వి పుష్కర సంప్రోక్షణ మహాయాగ కార్యక్రమాల్లో బుధవారం స్వామీజీ పాల్గొన్నారు. పిల్లలతో రామాయణం, మహా భారతం, భగవద్గీత వంటి ఆధ్యాత్మిక గ్రంథాలు చదివించడం ద్వారా హిందూ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. నగరంలో గత 24 సంవత్సరాలుగా దత్తనాథ క్షేత్రం ఆధ్యాత్మిక సేవలను అందిస్తోందని, భక్తుల ఆశయాలకు అనుగుణంగా క్షేత్రాన్ని నిర్వహిస్తున్నారని నిర్వాహకులు లునాని సోదరులను ప్రశంసించారు. తొలుత క్షేత్రంలో శ్రీ చక్రపూజ చేశారు. క్షేత్రం ప్రధాన శిఖరం సంప్రోక్షణను స్వామీజీ చేశారు. క్షేత్రంలోని మూలవిరాట్లకు పూజలు చేసి, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహ భాషణం చేశారు. ఉదయం 11 గంటలకు మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, బ్రహ్మ కలశాభిషేకం చేశారు. సాయంత్రం స్వామీజీ వేణు నాద సాగర కార్యక్రమం నిర్వహించారు. అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ పాల్గొన్నారు. క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఘనంగా గంగానమ్మ ఉత్సవం

బుట్టాయగూడెం: మండలంలోని లక్ష్మీపురంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఘనంగా గ్రామదేవత గంగానమ్మ ఉత్సవాలను గ్రామస్తులు మంగళవారం నిర్వహించారు. డప్పువాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా కప్పాలమ్మ జాతర



పూరిపాకలో కొలువైన కప్పాలమ్మ తల్లి

గణపవరం: గణపవరం మండల సరిపల్లె గ్రామ ప్రజల ఆరాధ్యదేవత కప్పాలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయం నుంచి సరిపల్లె సెంటర్‌లోని అమ్మవారి పూరిగుడిసెకు తీసుకు వచ్చి నెల రోజులుగా పూజలు, సేవలు నిర్వహిస్తున్నారు. సంక్రాతి పండుగ రోజున అమ్మవారికి జాతర నిర్వహించి, మరలా తిరిగి ఆలయానికి తీసుకువెళ్తారు. మంగళవారం ఉదయం అమ్మవారికి గవళ్లగుడుపు సేవ నిర్వహించి, అమ్మ వారిని గ్రామంలో వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఘటాలను ధరించిన ఆసాదులు ఇంటింటికీ వెళ్లి అమ్మవారికి చీర, సారెలు అందుకుంటారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేసి, చీర, పండ్లు, చలిమిడి పానకాలు సమర్పించుకుంటారు. అమ్మవారిని గ్రామంలో వైభవంగా ఊరేగించారు. విచిత్ర వేషాలు, శక్తివేషాలు, గంగిరెద్దు విన్యాసాలు, బుట్టబొమ్మలు, బ్యాండు మేళాలు, తీన్‌మార్ వాయిద్యాలతో అమ్మవారిని గ్రామంలో వీధివీధినా ఊరేగించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు క్రొవ్విడి సాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు బుధవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

అల్లుడికి 365 రకాల వంటలతో విందు



కొత్త అల్లుడికి 365 రకాల వంటకాలతో ఏర్పాటుచేసిన విందుభోజనం

జంగారెడ్డిగూడెం: స్థానిక లైఫ్‌స్టైల్ ఫర్నీచర్ యజమాని తడికమళ్ల దుర్గారావు, జ్యోతి దంపతులు తమ కొత్త అల్లుడికి 365 రకాల వంటకాలతో సంక్రాంతి విందు భోజనం ఏర్పాటు చేశారు. గతేడాది ఆగస్టులో వీరి కుమార్తె అమృత భవ్యశ్రీకి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వైరా పట్టణానికి చెందిన భరత్ సాయికి ఇచ్చి వివాహం చేశారు. తొలి సంక్రాంతి కావడంతో అల్లుడిని పండుగకు ఆహ్వానించి, 365 రకాల వివిధ రకాల పిండి వంటలు వడ్డించి విందు భోజనం పెట్టి ఆనందింపజేశారు.

అలరించిన సంగీత విభావరి



చిన్నారుల కూచిపూడి నృత్యం



ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తున్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం, సాయంత్రం స్వామి వారికి విశేష పూజలు, అలంకరణ, నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం తాడేపల్లి సాయికృష్ణ బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించి ఆకట్టుకుంది. అనంతరం నగరానికి చెందిన శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఆధ్యాత్మిక, భక్తి సంగీత విభావరి నిర్వహించారు. బంగారు బృంద శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గడ్డికి కొరత

- ఖరీఫ్‌లో వరుస తుఫాన్లు
- వర్షాలకు తడిసి కుళ్లిన గడ్డి



పాడి రైతులు కొనకపోవడంతో కొత్తూరు రోడ్డు పంటచేలల్లో ఉండిపోయిన గడ్డి

ఏలూరు రూరల్ : విత్తనాలు, ఎరువులు, ధాన్యమే కాదు గడ్డి సైతం కొందామంటే కొరివి, అమ్ముదామంటే అడవి అన్న చందంగా మారింది. ఏలూరు అర్బన్, రూరల్ మండల గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగు రైతులకు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. వరుస తుఫాన్లు కారణంగా గడ్డి కూడా నిరుపయోగంగా మారింది. పశువులకు గడ్డి కొరత ఏర్పడింది.

తుఫాన్లతో నష్టం

ఏలూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఈ ఏడాది 6,532 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేశారు. సుమారు 19,500 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 15 వేలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు చేరింది. దాదాపుగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యాయి. పంట చేతికొచ్చే సమయంలో గత నవంబర్, డిసెంబర్ నెలల్లో వరుసగా ఒకదాని తర్వాత ఒకటి తుఫాన్లు విరుచుకుపడ్డాయి. రోజుల తరబడి చేలు వర్షం నీటిలో నానిపోయాయి. దీంతో రైతులు చేతికొచ్చిన పంట కాపాడుకునేందుకు యంత్రాలను ఆశ్రయించారు. 70 శాతానికి పైగా పంట యంత్రాల ద్వారా మాసూళ్లు చేశారు. దీంతో గడ్డి చేతికి రాలేదు. మిగిలిన 30 శాతం పంటను కూలీలు కోసినప్పటికీ తుఫాన్ల కారణంగా గడ్డి కుళ్లి పోయింది. ఈ గడ్డి కొనేందుకు పాడి రైతులు ముందుకు రావడం లేదు. గతంలో ఇదే సమయానికి చేలల్లో కుప్పల, కుప్పలుగా గడ్డి కనిపించేదని, ఎకరం చేలో గడ్డి సుమారు రూ.10 వేలకు అమ్ముకునే వారమని రైతులు గుర్తుచేసుకుంటున్నారు.

అన్నీ కష్టాలే



ఈ ఏడాది ఆశించిన పంట దిగుబడి రాలేదు. పెట్టుబడి పెరిగింది. ఆఖరికి గడ్డి కూడా పనికి రాకుండా పోయింది. వరుసగా వచ్చిన తుఫాన్లు కారణంగా యంత్రాలతో వరి పంట మాసూళ్లు చేశాం. కల్లాల్లోనే గడ్డి వదిలేయడంతో వర్షాలకు తడిచి కుళ్లి పోయింది. ఈ గడ్డిని పాడి రైతులు కొనడం లేదు. దీంతో గడ్డి చేలల్లోనే వదిలేశాం.

– పిల్లగోల సాయి, కైలు రైతు, వెంకటాపురం

గడ్డి దొరకడం లేదు



యంత్రాలతో కోసిన గడ్డి పనిచేయదు. మెషీన్ లోపలకు గడ్డి పోవడం వల్ల ఆయిల్ వాసన వస్తుంది. దీంతో పశువులు తినడం లేదు. అందుకే కల్లాల్లోనే గడ్డి కుళ్లిపోయింది. మార్కెట్‌లో గడ్డికి గిరాకీ పెరిగింది. ఒక మోపు రూ.200కు అమ్ముతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొంటున్నాం. అప్పటికీ మేత చాలకపోతే తవుడు, పచ్చి గడ్డితో మేపుతున్నారు.

– రంగారావు, పాడి రైతు, వెంకటాపురం

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	04
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	19

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	03
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	02
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు - తిరుపతి	16.00	4830	24
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	18
ఏలూరు-బీహెచ్‌ఈఎల్	21.50	98506	18

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	48	బీన్షచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	36-48	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	70
కాకర కాయలు	44	బీట్‌రూట్	48
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	56	పాలకూర	10
బంగాళదుంపలు	30-36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07
దోసకాయలు	30-36	పుదీనా	05
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

జోరుగా కోడి పందేలు



చొదిమెళ్ల బరిలో తలపడుతున్న కోళ్లు

ఏలూరు రూరల్ చొదిమెళ్ల, మాదేపల్లి ప్రాంతాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. బరుల వద్ద గుండాటలు, మద్యం షాపులు, బిర్యానీ షాపులు కొనసాగాయి. బరుల వద్ద భారీగా నగదు చేతులు మారింది. కోడిపందేలను తిలకించేందుకు మహిళలు, చిన్నారులు ఆసక్తి చూపారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు



మాదేపల్లిలో బరి వద్ద గుండాట



ఓడిన కోడిని కాల్చుతూ.. ముక్కలు కొడుతూ..